## క్లుప్తంగా

### క్రీడల అభివృద్ధికి కృషి చేయాలి



కాశిబుగ్గ: క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని వరంగల్ జిల్లా యువజన, క్రీడల అధికారి సత్యవాణి కోరారు. ఈమేరకు డీవైఎస్ఓ ఆధ్వర్యంలో క్రీడల సిబ్బంది, కోచ్‌లు రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను ఓ సిటీలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్టేడియాలు, క్రీడల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ జిల్లాలోని క్రీడలు, స్టేడియాల అభివృద్ధిపై సమావేశం ఏర్పాటు చేసి, సీఎం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారని డీవైఎస్ఓ సత్యవాణి తెలిపారు. అనంతరం మంత్రిని క్రీడల కార్యాలయం సిబ్బంది సన్మానించారు.

**వరంగల్‌లోనే రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలి**

ఖిలా వరంగల్: ఇళ్లు, ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్లన్నీ తూర్పు నియోజక వర్గం పరిధిలో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే జరిగేలా చర్యలు తీసుకోవాలని పోపా రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ కోరారు. ఈమేరకు వరంగల్ ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడేళ్లుగా నియోజకవర్గ ప్రజలు హనుమకొండ, వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజిస్ట్రేషన్ల కోసం తూర్పు భూభాగాన్ని రెండుగా చీల్చడం బాధాకరమని వాపోయారు.

### ముమ్మరంగా బడిబాట

కాళోజీ సెంటర్: జిల్లాలో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందని వరంగల్ డీఈఓ వాసంతి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో 32 మంది బడి ఈడు పిల్లలను గుర్తించి వివిధ పాఠశాలల్లో చేర్పించినట్లు పేర్కొన్నారు. ఎంఈఓలు, మండల నోడల్ అధికారులు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు బడిఈడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

### 10 వరకు గడువు

కాళోజీ సెంటర్: 'ట్రిపుల్ విన్ పార్టనర్‌షిప్'లో భాగంగా జర్మనీలో రిక్రూట్ అయ్యే నర్సులకు జర్మన్ భాష శిక్షణ కోసం ప్రస్తుతం జరగగున్న ప్రత్యేక స్క్రీనింగ్, ఎన్‌రోల్‌మెంట్ ప్రోగామ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 10 చివరి తేదీ అని వరంగల్ జిల్లా ఉపాధి అధికారి ఎస్.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఎన్‌రోల్‌మెంట్ కోసం 99088 30438, 89190 47600, 70323 79066 ఫోన్ నంబర్లు, లేదా www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆమె సూచించారు.

### పేద విద్యార్థికి చేయూత

ఎంజీఎం: వాసవి క్లబ్ కేసీజీఎఫ్ డాక్టర్స్ వరంగల్ శాఖ ఆధ్వర్యంలో పేద ఇంజనీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. నర్సంపేటలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న గాదె ఆశ్రిత తండ్రి మరణించగా, కళాశాల ఫీజు చెల్లించడానికి ఆమె ఇబ్బంది పడడాన్ని రీజినల్ చైర్మన్ అవేర్‌నెస్ విజిట్‌లో భాగంగా పుల్లూరి కిషోర్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తెలుసుకున్నారు. ఈమేరకు క్లబ్ తరఫున చేయూతనందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ రీజినల్ సెక్రటరీ బొడ్ల మోహన్, సెక్రటరీ వెనిశెట్టి ప్రవీణ్, ట్రెజరర్, శివ్వా సృజన్, సీనియర్ వైద్యులు సోమ మాధవ, ఈశ్వర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### ఆస్తులను విక్రయించొద్దు

నయీంనగర్: హనుమకొండ మిషన్ ఆస్పత్రిని ఆనుకొని ఉన్న క్రైస్తవ సమాజానికి సంబంధించిన (బాప్టిస్ట్ సంస్థ) ఆస్తులను ఎవరూ అమ్మకూడదు, కొనకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ రెవ జీ.జాన్ మార్కండేయ, చైర్మన్ రెవ డాక్టర్ దామెర ఐజాక్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ లీజుకు తీసుకున్న భూమిని స్కూల్ వారు అమ్మడానికి ప్రయత్నిస్తున్నారని, అలాంటి దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీసీఎఫ్ బాధ్యులు విద్యాకర్, టి.ప్రసంగి, ఇమ్మానుయేల్, వినయ్‌కుమార్, కారణ్, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

### చర్య తీసుకోవాలి

హన్మకొండ చౌరస్తా: రాష్ట్రంలో కల్తీపాల అమ్మకాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు కోరారు. ఈమేరకు హైదరాబాద్ నారాయణగూడలోని రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ డైరెక్టర్ డాక్టర్ శివలీలను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి చక్రపాణి, దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు దామోదర్, క్యాట్రో చైర్మన్ శంకర్‌లాల్, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్, రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి కాసు విశ్వేధర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# దత్తతలో దందా!

- బాలల సంరక్షణ విభాగం తీరుపై ఆరోపణలు
- వరంగల్‌లో బొమ్మిడి నర్సయ్య దంపతుల దరఖాస్తు
- హనుమకొండ లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్‌కు డబ్బుల చదివింపు
- రీవ్యాలిడేషన్ కోసం రూ.6 వేలు తీసుకున్న సదరు అధికారి
- లోతుగా విచారిస్తే వెలుగులోకి రానున్న మరిన్ని విషయాలు..



సాక్షి, వరంగల్: పిల్లలు లేని దంపతులను అవసరాలను ఆసరాగా చేసుకుంటూ శిశువిక్రయ ముఠాలు వ్యాపారం చేస్తాయి. ఒక్కో పిల్లాడి కోసం రూ.లక్షలు ఇస్తే తెప్పిస్తామంటూ వల విసిరి అందినకాడికి దండుకుంటాయి. ఇప్పుడు ఇదే తరహాలో పిల్లలు లేని దంపతుల అమాయకత్వాన్ని బాలల సంరక్షణ విభాగంలోని కొంతమంది సిబ్బంది క్యాష్ చేసుకుంటుండడం సంచలనం కలిగిస్తోంది. ఆ దంపతులకు మార్గనిర్దేశనం చేయాల్సిన వారే అక్రమార్జనకు అలవాటుపడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నారు. తాజాగా వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బొమ్మిడి నర్సయ్య, యాదలక్ష్మి దంపతుల అడాప్షన్ వ్యవహారంలో ఈ బాగోతం బయటకు వచ్చింది. దీంతో చట్టబద్ధత దత్తత విషయంలోనూ దరఖాస్తుదారులకు డబ్బుల వేధింపులు తప్పడం లేదన్న విమర్శలున్నాయి. ఈ అధికారులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

**అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని...**

బాలల న్యాయ చట్టం–2015 ప్రకారం సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) ద్వారా బాలలను దత్తత తీసుకునేందుకు కొన్ని నిబంధనలతో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కారా.నిక్.ఇన్‌ను కేంద్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ అందుబాటులోకి తెచ్చింది. పిల్లలు లేని వారికి మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ దత్తత ప్రక్రియ కొనసాగుతుంది. దంపతుల వయసు నిర్ధారించుకొని అర్హత గల శిశువును దత్తత ఇవ్వాలి. దత్తత కోరే దంపతుల దరఖాస్తులను అధికారులు పరిశీలించి గృహ సందర్శన (హోం స్టడీ) నివేదికను సిద్ధం చేయాలి. క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుల సామాజిక ఆర్థిక స్థితులను బేరీజు వేసి సంబంధిత గృహ సందర్శన నివేదికను కారా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. ఈ నివేదిక మూడు సంవత్సరాల కాలపరిమితి వరకు ఉంటుంది. ఈలోగా శిశువును దత్తత తీసుకోకుంటే మళ్లీ మూడు సంవత్సరాల అనంతరం వారికిచ్చే లాగిన్ ఐడీ ద్వారా గృహ సందర్శన నివేదికను రెన్యూవల్ చేయాలని కోరుతారు. దంపతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అన్నీ చూసుకుంటామని వరంగల్, హనుమకొండ బాలల సంరక్షణ విభాగంలోని కొంతమంది అధికారులు అందినకాడికి దండుకుంటున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే శిశువులను దత్తత తీసుకున్న వారితోనూ సత్సంబంధాలను కొనసాగిస్తూ అప్పుడప్పుడు బహుమతులు కూడా తీసుకుంటున్నారన్న టాక్ ఉంది. తాజాగా తెర మీదకు వచ్చిన బొమ్మిడి నర్సయ్య, యాదలక్ష్మి దంపతుల దత్తత విషయంలో మాదిరిగానే ఇంకా అనేక మంది దంపతుల నుంచి డబ్బులు చేతులు మారాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

**కానరాని చర్యలు..**

రాయపర్తి మండలానికి చెందిన మురుపోజు రాంబాబు, సవిత దంపతులు 2019 ఫిబ్రవరి 9న ఆడబిడ్డ కావాలని కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయడంతో గృహ సందర్శన నివేదికను అధికారులు సిద్ధం చేసి అప్‌లోడ్ చేశారు. మూడేళ్ల కాలపరిమితి దాటడంతో 2022 డిసెంబర్ 6న గృహ సందర్శన నివేదికను తిరిగి నిర్వహించాలని తమ లాగిన్ ద్వారా రీవ్యాలిడేషన్‌కు రిక్వెస్ట్ పంపారు. 60 రోజుల్లో హోం స్టడీ చేయాల్సి ఉంది. కానీ, రెండేళ్లయినా కూడా సదరు అధికారి గృహ సందర్శన నివేదిక సిద్ధం చేయలేదు. దీంతో తాము సీనియారిటీని కోల్పోవాల్సి వచ్చిందని రాంబాబు దంపతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా కూడా చర్యలు తీసుకోలేదు. సంబంధిత అధికారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన బొమ్మిడి నర్సయ్య–యాదలక్ష్మి దంపతులు 2020 జూలై 31న పిల్లలు కావాలని 'కారా'కు దరఖాస్తు చేసుకున్నారు. అప్పుడు అధికారులు ఇంటికి వెళ్లి అధ్యయనం చేసి నివేదికను సమర్పించారు. మూడు సంవత్సరాల తర్వాత రీవ్యాలిడేషన్ చేయాలి. డీడీ తీయాలంటే హనుమకొండ బాలల పరిరక్షణ విభాగంలో పనిచేస్తున్న ఓ అధికారికి రూ.6 వేలు ఇచ్చారు. హనుమకొండలోని కార్యాలయంలో 2023 ఆగస్టులో డబ్బులిచ్చారు. ఈ విషయం వరంగల్ దత్తత విభాగం అధికారికి కూడా తెలుసు. డీడీకి రూ.రెండు వేలు ఖర్చవుతాయని, మిగిలినవి ఖర్చులకు కావాలని తీసుకున్నారు. నెలలో రెండుసార్లు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ ఓపెన్ చేసి స్టేటస్ తెలుసుకునేందుకు వచ్చిన ప్రతిసారి రూ.500 తీసుకుని మాకు వివరాలు చెప్పేవారని నర్సయ్య దంపతులు తెలిపారు. వయసు అయిపోయిందంటూ పిల్లలను దత్తత ఇవ్వరని అడాప్షన్ అధికారి ఇటీవల మెయిల్ చేశారు. దీనిపై కలెక్టర్ ప్రావీణ్యకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. పాపను దత్తత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## పార్లమెంట్‌లో ప్రజాగొంతుకై నిలుస్తా



న్యూశాయంపేట: మాట్లాడుతున్న ఎంపీ కావ్య

న్యూశాయంపేట: పార్లమెంట్‌లో ప్రజాగొంతుకై నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ కార్యాలయాన్ని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తన విజయానికి సహకరించిన ఆ పార్టీ నాయకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేదలు, గుడిసెవాసులకు ఇళ్లు, ఇళ్ల పట్టాలు అందించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు టి.శ్రీనివాస్‌రావు, విజయసారథి, నేదునూరి జ్యోతి, కర్రె భిక్షపతి, టి.వెంకట్రాములు, రమేష్, శ్రీనివాస్, సదాలక్ష్మి, సుగుణమ్మ, కరుణాకర్, బాషుమియా, ఎల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

హన్మకొండ కల్చరల్: రాష్ట్రంలోని అర్చక ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎంపీ కడియం కావ్య హామీ ఇచ్చారు. , ధూపదీప నైవేద్య అర్చకులకు సకాలంలో వేతనాలు అందేలా చూస్తానన్నారు. ఆమెను తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్, గణపతిశర్మ, అర్చకులు శుక్రవారం కలిసి సన్మానించి వేదాశీర్వచనం చేశారు.

## అధిక ఫీజులను నియంత్రించాలి



వినతిపత్రం అందజేస్తున్న టీఎస్ఎఫ్ బాధ్యులు

విద్యారణ్యపురి: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలని టీఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిటీ ప్రెసిడెంట్ మణితేజ మాట్లాడుతూ డీఎఫ్ఆర్‌సీని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యాలు అమలు చేయకుండా ఇష్టారీతిలో విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టీఎస్ఎఫ్ సిటీ జనరల్ సెక్రటరీ వరికుప్పల సాంబరాజు, సెక్రటరీ అంబాల హరికుమార్, బాధ్యుడు బన్ని పాల్గొన్నారు.

**'విద్యార్థులను వేధిస్తున్న విద్యాసంస్థలు'**

విద్యార్థులను రాష్ట్రంలోని పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు వేధింపులకు గురిచేస్తున్నాయని, అలాంటి వాటిపై కఠిన చర్య తీసుకోవాలని సమాచార హక్కు అవగాహన సాధన సమితి బాధ్యులు కొంగర వరుణ్, భానుప్రకాష్, అఖిలేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ డీఈఓ ఎండీ.అబ్దుల్‌హైకి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అమాయక విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పకుండా నిరోధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## ఆర్‌బీఎస్‌కే టీంలకు టూల్ కిట్లు



కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

గీసుకొండ: పాఠశాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం చేపట్టిన రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ టీంలకు 14 రకాల పరికరాలతో కూడిన కిట్‌లను అందిస్తున్నామని వరంగల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో టీంలకు శుక్రవారం కిట్‌లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. కిట్‌లలోని పరికరాలతో ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల సమన్వయంతో పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు మొబైల్ టీంలలోని వైద్యులు, సిబ్బంది వ్యాధులు ఉన్న విద్యార్థులను ఉన్నతమైన ఆస్పత్రులకు రిఫర్ చేస్తారన్నారు. అంగవైకల్యంతో పుట్టిన బిడ్డలకు ఎంజీఎం ఆస్పత్రిలో వైద్యం అందిస్తారని తెలిపారు. డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలి



కాశిబుగ్గ: మాట్లాడుతున్న మంద కుమార్

కాశిబుగ్గ: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జూలై 7న వరంగల్ కేంద్రంగా జరగనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మెస్పీ నాయకుడు మంద కుమార్ పిలుపునిచ్చారు. ప్రతాప్‌నగర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్‌లో కవాతు నిర్వహించనున్నట్లు వివరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తడుగుల విజయ్, గంగారపు మల్లన్న, కృష్ణప్రసాద్, చందు, రాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**న్యూశాయంపేటలో..**

కాజీపేట అర్బన్: నగరంలో జూలై 7వ తేదీన నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ కోరారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుకుమార్ మాదిగ ఆధ్వర్యంలో న్యూశాయంపేటలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో సురేందర్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు ఐక్యంగా పోరాడాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్, కుమ్మరి రాజయ్య, పుట్ట రవి, మంద రాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

**నేత్రదానం**

ఎంజీఎం: హనుమకొండలోని అమరావతి నగర్‌కు చెందిన చలుమల కిష్టమ్మ (85) ఇటీవల అనారోగ్య సమస్యలతో మరణించారు. ఆమె కుమారులు, కుటుంబ సభ్యుల అంగీకారం మేరకు కిష్టమ్మ నేత్రాలను తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ అధ్యక్షుడు మల్లారెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్య శాఖ సిబ్బంది, ఎల్‌వీ.ప్రసాద్ నేత్ర సేకరణ నిపుణుడు లక్ష్మణ్ ద్వారా సేకరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మరణాంతరం నేత్రదానం చేయాలనుకునే వారు 87905 48706 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, శంకర్‌రావు యాదవ్, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**వెయిట్ లిఫ్టింగ్ సభ్యులకు సన్మానం**

కాజీపేట రూరల్: హైదరాబాద్‌లో గురువారం జరిగిన తెలంగాణ స్టేట్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వారికి ప్రాధాన్యం లభించిందని రైల్వే రిటైర్డ్ నాయకుడు, హనుమకొండ వెయిట్ లిఫ్టింగ్ సంఘం ప్రెసిడెంట్ అనుమాల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. ఈమేరకు వారిని సన్మానించారు. వైస్ ప్రెసిడెంట్‌గా కాజీపేటకు చెందిన ఎం.కృష్ణమూర్తి, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మహబూబాబాద్‌కు చెందిన ఎం.సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వివరించారు.

**ఎమ్మెల్యే నాగరాజును కలిసిన నాయకులు**

మడికొండ: వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును మడికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య విజయంలో తనవంతు పాత్ర పోషించిన ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, బిల్లా రవీందర్, 46, 64వ డివిజన్ల నాయకులు పల్లపు అర్జున్, వస్కుల నాగరాజు, శ్రీనివాస్, శివ, కృష్ణ, మల్లికార్జున్, బైరి లింగరాజు గౌడ్ పాల్గొన్నారు.

**నీట్ ర్యాంకర్‌కు సన్మానం**

హసన్‌పర్తి: ఇటీవల ప్రకటించిన నీట్ ఎంట్రెన్స్‌లో ఆల్ ఇండియా రెండవ ర్యాంక్ సాధించిన ఎల్లాపురంలోని ఎస్సీఆర్ పూర్వ విద్యార్థి లావుడ్య శ్రీరామ్‌ను ఆ పాఠశాల యాజమాన్యం అభినందించింది. పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గొరిశెట్టి జగన్మోహన్ మాట్లాడుతూ ములుగుకు చెందిన లావుడ్య శ్రీరామ్.. ఏడవ తరగతిలో తమ పాఠశాలలో ప్రవేశం పొంది పదవ తరగతి పూర్తిచేసి రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించినట్లు చెప్పారు.

**శ్వేతార్కలో వరుణ హోమం**

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో అర్చకులు శుక్రవారం వరుణ హోమం జరిపించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ హోమం చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన వోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో శ్వేతార్కుడికి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ, మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్ పాల్గొన్నారు.

**గిరిజన ఉద్యోగులకు న్యాయం చేయాలి**

హన్మకొండ: గిరిజన ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని ఎస్టీ విద్యుత్ ఉద్యోగులు కోరారు. హనుమకొండకు వచ్చిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.నంద రాథోడ్, ఎస్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు వాలు నాయక్, నాయకులు రాజేందర్, లక్ష్మణ్ నాయక్, రవి, రాములు నాయక్, ఏతులు లక్ష్మణ్ నాయక్, తారాచంద్, తదితరులు పాల్గొన్నారు.

**ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా అన్వేష్**

కాశిబుగ్గ: కాంగ్రెస్ వరంగల్ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా గిర్మాజీపేటకు చెందిన కట్కూరి అన్వేష్‌ను నియమించారు. ఈమేరకు ఓసిటీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనకు మంత్రి కొండా సురేఖ నియామక పత్రాన్ని అందించారు.

**పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా సుధాకర్**

వరంగల్: అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ తూర్పు నియోజకవర్గ 22వ డివిజన్ అధ్యక్షుడిగా వలుస సుధాకర్‌ను నియమించినట్లు వరంగల్ జిల్లా అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఆడెపు రవీందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్ తెలిపారు. ఈమేరకు పోచమ్మమైదాన్‌లోని జిల్లా కార్యాలయంలో నియామక ఉత్తర్వులను సుధాకర్‌కు అందజేశారు.

# బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



ఖిలా వరంగల్: కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్, ఉపాధ్యాయులు, తదితరులు



మడికొండ: రాంపూర్‌లో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

ఖిలా వరంగల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని స్థానిక కార్పొరేటర్ బైరబోయిన ఉమ, కాంగ్రెస్ నేత బైరబోయిన దామోదర్ యాదవ్ సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఖిలా వరంగల్ మధ్యకోటలో ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.ప్రసాద్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులు వారు హాజరై బడిబాట కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని, తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాల్లో విద్యాబోధన ఉంటుందని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చక్కటి భవిష్యత్‌కు పునాది వేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శైలంద్ర, భాస్కర్, సతీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

**మడికొండ రాంపూర్‌లో..**

మడికొండ: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని రాంపూర్ పాఠశాల హెచ్ఎం యమునాదేవి కోరారు. ఈమేరకు కాజీపేట మండలం రాంపూర్‌లో మడికొండ సెక్టార్ రాంపూర్ అంగన్‌వాడీ సెంటర్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యమునాదేవి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన మెరుగ్గా ఉంటుందని వివరించారు. ఉన్నత విద్యాధికులైన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం భోజనం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, వీరప్రతాప్, అంగన్‌వాడీ టీచర్లు శారద, స్వరూప, జ్యోతి, మంజుల, సంధ్యారాణి, రజిత, తదితరులు పాల్గొన్నారు.

**బడి బాటను పకడ్బందీగా నిర్వహించాలి**

హన్మకొండ: బడి బాట కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా పకడ్బందీగా నిర్వహించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ కోరారు. బడీడు పిల్లలు బడిలో చేర్పించేందుకు విద్యాశాఖ కృషి చేయాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతీ మండలంలో ఇంటర్ నేషనల్ పాఠశాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పేదలకు నాణ్యమైన ఉన్నత విద్యావకాశాలను పెంపొందించాలని, ప్రభుత్వ పాఠశాలలో నర్సరీ విద్యను ప్రారంభించాలని, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని, బడ్జెట్‌లో విద్యకు 20శాతం నిధులు కేటాయించాలని, విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలని, శాస్త్రీయ దృక్పథం కలిగిన విద్యా విధానాన్ని అమలు చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచాలని సూచించారు.

**గుండ్ల సింగారంలో..**

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ ఉపాధ్యాయులు గుండ్ల సింగారంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ విద్యాసంవత్సరంలో పదవ తరగతిలో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. తమ స్కూల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం జీవీ.రామారావు, ఉపాధ్యాయులు వల్సపైడి, డాక్టర్ వాసు, ఎడ్ల శ్రీనివాస్, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో నేడు.. రేపు

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: సబ్‌స్టేషన్ల నిర్వహణ కారణంగా హనుమకొండ, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి, వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. వడ్డెపల్లి, ఆర్‌ఈసీ, కలెక్టరేట్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11.30 గంటల వరకు, కేయూసీ, సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మడికొండ సబ్‌స్టేషన్ పరిధిలో 10 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే, వరంగల్‌లోని ఆజంజాహి మిల్స్, స్టేషన్ రోడ్డు, ఖిలా వరంగల్, గొర్రెకుంట, పోతన, దేశాయిపేట, బొల్లికుంట, ఉర్సు, శంభునిపేట ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు, కేఎంసీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 7గంటల నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

### రేపు విశ్వకర్మ సదస్సు

హన్మకొండ కల్చరల్: ఓరుగల్లు విశ్వబ్రాహ్మణ గురుపీఠం ఆధ్వర్యంలో సమాజంపై కాలజ్ఞాన ప్రభావం అంశంపై ఆదివారం విశ్వకర్మ సదస్సు జరగనుంది. సాయంత్రం 4గంటలకు వరంగల్ హంటర్‌రోడ్డులోని పద్మావతి గార్డెన్స్‌లో విశ్వబ్రాహ్మణ గురుపీఠం కన్వీనర్ చొల్లేటి కృష్ణమాచారి అధ్యక్షతన జరగనున్న సదస్సులో ముఖ్యఅతిథులుగా మఠాధిపతులు నొస్నం వెంకటాద్రి స్వామి, ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషు, వైద్యుడు గజ్జెల రాజభరత్ కుమార్, సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణులు అధికసంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

### రేపు నీట్ కౌన్సెలింగ్‌పై అవగాహన

న్యూశాయంపేట: నీట్‌లో అడ్మిషన్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు.. కౌన్సెలింగ్‌లో అనుసరించాల్సిన అంశంపై ఈనెల 9న వరంగల్ ఇస్లామియా కళాశాలలో మధ్యాహ్నం 2గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మైనార్టీ ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ డాక్టర్ అనీస్ సిద్దిఖీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98490 12987 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని అనీస్ సిద్దిఖీ కోరారు.